# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 12-8-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి:30 సంచిక:9 పేజీలు:6 వెల: రూ.1/-

## గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం - 10 మంది దుర్మరణం



అహ్మదాబాద్, ఆగష్టు 11: గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగివున్న ట్రక్కును ప్రయాణికులతో వెళ్తున్న ఓ మినీ ట్రక్కు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 10మంది దుర్మరణం చెందారు. అహ్మదాబాద్ జిల్లాలో రాజ్‌కోట్- అహ్మదాబాద్ హైవేపై బగోదర గ్రామం సమీపం లో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది.

ఈ ప్రమాద మృతుల్లో ఐదుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నట్టు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. కొందరు వ్యక్తులు బృందంగా సురేంద్రనగర్ జిల్లాలోని చోటిలా నుంచి అహ్మదాబాద్ వైపు మినీ ట్రక్కులో తిరిగి వస్తుండగా ఈ ఘోరం చోటుచేసుకున్నట్టు అహ్మదాబాద్ ఎస్పీ అమిత్ వాసావా తెలిపారు. ఈ ప్రమాదంలో మినీ ట్రక్కు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కాగా, ప్రమాదవార్తపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు.. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు.. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని గుజరాత్ ముఖ్యమంత్రిని ఆదేశించారు..మృతుల కుటుంబాల ఒక్కొక్కరికి రూ 2 లక్షలు నష్ట పరిహారం ప్రకటించారు.

## 47 ఏళ్ల తర్వాత చంద్రుడి పైకి రష్యా మళ్లీ రాకెట్ ప్రయోగం

### -చంద్రయాన్-3 కంటే రెండు రోజుల ముందే జాబిల్లిపై రష్యా రాకెట్



న్యూ డిల్లీ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సుమారు 47 ఏళ్ల తర్వాత చంద్రుడి పైకి రష్యా మళ్లీ రాకెట్ ప్రయోగం చేపట్టింది. దక్షిణ ధ్రువమే లక్ష్యంగా 'లునా ? 25' అనే స్పేస్‌క్రాఫ్ట్‌ను శుక్రవారం ఉదయం విజయవంతంగా ప్రయోగించింది. రష్యా కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 2.00 గంటలకు వాస్టోక్నీ కాస్మోడ్రోమ్ నుంచి 'లునా-25' రాకెట్ నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లింది. ఐదు రోజుల్లో ఇది చంద్రుడి కక్ష్యలోకి చేరనుంది. అనంతరం, జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగేందుకు అనువైన ప్రదేశం కోసం కొన్ని రోజుల పాటు (3 లేదా 7 రోజులు) అన్వేషించిన అనంతరం చంద్రుడిపై దిగుతుంది.ఆగస్టు 21న ఈ వ్యోమనౌక చంద్రుడిపై దిగే అవకాశం ఉందని రాస్‌కాస్మోస్ అధికారులు పేర్కొన్నారు. అన్నీ అనుకూలంగా జరిగితే ఏడాది పాటు ఇది జాబిల్లిపై పరిశోధనలు జరపనుంది. అంతరిక్ష పరిశోధనలో రష్యా సత్తా చాటేందుకు ఈ ప్రయోగం చేపట్టామని రష్యా స్పేస్ ఏజెన్సీ రాస్‌కాస్మోస్ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, 1976 తర్వాత రష్యా చేపట్టిన తొలి లునార్ ల్యాండర్ ప్రయోగం ఇదే కావడం విశేషం.

మరోవైపు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రయోగించిన 'చంద్రయాన్-3' కూడా జాబిల్లి వైపు దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. ఇస్రో ప్రణాళిక ప్రకారం చంద్రయాన్-3 ఆగస్టు 23న జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగుతుంది. కాగా, చంద్రుడి దక్షిణ ధ్రువంపై 'చంద్రయాన్-3' ద్వారా సాఫ్ట్ ల్యాండింగ్ చేసి చరిత్ర సృష్టించాలని భావిస్తున్న ఇస్రోకు.. లునా-25 పోటీ ఇస్తోంది. చంద్రయాన్-3 కంటే రెండు రోజుల ముందే రష్యా పంపిన లునా-25 జాబిల్లిపై అడుగుపెటబోతోంది. మరోవైపు లునా-25ని విజయవంతంగా ప్రయోగించడంపై రష్యా అంతరిక్ష పరిశోధనా సంస్థ రోస్‌కాస్మోస్‌కు ఇస్రో అభినందనలు తెలిపింది. చంద్రయాన్-3, లునా-25 తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించింది.

## చైనాలోని హెబెయ్ ప్రావిన్స్‌ను ముంచెత్తిన వరదలు..

### - 29 మంది మృతి, 16 మంది గల్లంతు

హెబెయ్ ఆగష్టు 11 : భారీ వర్షాల కారణంగా చైనాలోని హెబెయ్ ప్రావిన్స్‌ను వరదలు ముంచెత్తాయి. ఈ వరదల వల్ల ప్రావిన్స్‌లోని లోతట్టు ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 16 మంది గల్లంతయ్యారు. ఈ ప్రకృతి విపత్తు హెబెయ్ ప్రావిన్స్‌కు 95.811 బిలియన్ యువాన్‌ల నష్టాన్ని మిగిల్చిందని అధికారులు తెలిపారు.గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో హెబెయ్ ప్రావిన్స్‌లో వరదలు పోటెత్తాయని చైనా ఆర్థికమంత్రి చెప్పారు. ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కోవడానికి అదనంగా 1.46 బిలియన్ యువాన్‌లను ఆర్థిక సాయంగా అందించినట్లు ఆయన తెలిపారు. వివిధ వరద ప్రభావిత రీజయన్లలో పునరావాస చర్యల కోసం ప్రభుత్వం ఇప్పటికే 7.738 బిలియన్‌ల నిధులను మంజూరు చేసిందని, తాజా నిధులు అందుకు అదనమని పేర్కొన్నారు.

నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ కవితకు అంతము లేదని-
భవితకు శుభమే కలదని భావించుము-మా
నవతకు రక్షణ నాసXX-
యువతకు బోధింపవలయు నుత్సాహముతోన్!!



(ఆగష్టు 12 అంతర్జాతీయ యువ దినోత్సవం...)
August 12 International Youth Day....)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# దేశానికే అన్నం పెట్టేంతగా ధాన్యం పండిస్తున్నాం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఆగష్టు 11: వ్యవసాయరంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉన్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశానికే అన్నం పెట్టేంతగా ధాన్యం పండిస్తున్నామని చెప్పారు.

రైతులకు బీమా కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తమదన్నారు. వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తున్నదని వెల్లడించారు. హైదరాబాద్ శంషాబాద్‌లోని నోవాటెల్‌లో దేశంలోనే తొలి అగ్రికల్చర్ డేటా ఎక్స్ఛేంజ్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు ఒక రైతు కాబట్టి వ్యవసాయంపై అవగాహన ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరాన్ని అతి తక్కువ సమయంలో నిర్మించామని చెప్పారు.

గతంలో పాలమూరు నుంచి వలసలు ఉండేవని, ఇప్పుడు వలసలు లేవని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఉచితంగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. దేశంలో నాణ్యమైన పత్తి తెలంగాణ నుంచి వస్తున్నదని చెప్పారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరించామనన్నారు.

# మణిపూర్ మండుతుంటే ప్రధాని నవ్వులు చిందిస్తూ, జోక్‌లు విసరడమా!

### -భరతమాతపై ఎక్కడ దాడి జరిగినా అక్కడుంటా...
### -కేంద్రంపై మరోసారి విరుచుకుపడ్డ రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మణిపూర్‌లో భరతమాతను హత్య చేశారని, వీళ్లు దేశద్రోహులే కానీ, దేశభక్తులు కాదని కేంద్రంలోని అధికార బీజేపీని అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ఘాటుగా విమర్శించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. నెలలు తరబడి మణిపూర్ మండుతుంటే ఆ అంశంపై చర్చలో పాల్గొన్న ప్రధాని నవ్వులు చిందిస్తూ, జోక్‌లు విసరడాన్ని తప్పుపట్టారు. ప్రధాని హోదాకు ఇది తగదన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో శుక్రవారంనాడు మీడియాతో రాహుల్ మాట్లాడారు."నిన్న పార్లమెంటులో ప్రధానమంత్రి 2 గంటల 13 నిమిషాలు మాట్లాడారు. చివర్లో మణిపూర్‌పై 2 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. మణిపూర్ నెలల తరబడి మండుతోంది. ప్రజలు విలువైన ప్రాణాలు కోల్పోయారు. అత్యాచారాలు జరిగాయి. కానీ ప్రధాని మాత్రం నవ్వులు చిందిస్తూ, జోకులు విసురుతున్నారు. ఇది ఆయనకు తగదు" అని మోదీని రాహుల్ విమర్శించారు. మణిపూర్ ఘర్షణలను ఆర్మీ కేవలం రెండు రోజుల్లో నిలిపివేయగలదన్నారు. కానీ



మణిపూర్ రగులుతూనే ఉండాలని ప్రధాని కోరుకున్నారని, మంటలను చల్చార్చే ప్రయత్నం చేయలేదని చెప్పారు. మణిపూర్‌ను సైన్యం అదుపులోకి తీసుకోవాలని తాను కోరినప్పుడు బీజేపీ తనను విమర్శించిందని అన్నారు. మణిపూర్‌పై అసలు చర్చలే జరగలేదని, కేవలంం హింస మాత్రమే చోటచేసుకుందని ఆరోపించారు. హింసను మొదట అదుపు చేసి, ఆ తర్వాత దానికి చరమగీతం పాడాల్సి ఉంటుందన్నారు. ప్రధాని వద్ద ఇందుకు అవసరమైన అన్ని అస్త్రాలు ఉన్నప్పటికీ ఆయన వాటిని వాడలేదని, చేసిందేమీ లేకపోగా నవ్వులు చిందిస్తున్నారని తప్పుపట్టారు.

భరతమాతపై ఎక్కడ దాడి జరిగినా అక్కడుంటా...

మీడియాను వాళ్లు (కేంద్రం) అదుపులో పెట్టుకున్నారనే విషయం తనకు తెలుసునని, రాజ్యసభ, లోక్‌సభ టీవీని తమ అదుపులో పెట్టుకున్నారని, అయినప్పటికీ తాను తన పని తాను చేసుకుంటూ పోతానని చెప్పారు. భరతమాతపై ఎక్కడ దాడి జరిగినా అక్కడ తాను ఉంటానని, భరత మాత పరిరక్షణకు కట్టుబడి ఉంటానని రాహుల్ మీడియా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## సినీ నటి జయప్రదకు ఆరు నెలల జైలుశిక్ష



చెన్నై, ఆగష్టు 10: ప్రఖ్యాత సినీ నటి, మాజీ ఎంపీ జయప్రదకు ఆరునెలల జైలుశిక్ష పడింది. చెన్నైలోని ఎగ్మోర్ కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. ఆమెకు 5వేల జరిమానా కూడా విధించారు. రాయపేటలో ఉన్న జయప్రదకు చెందిన సినీ థియేటర్ ఉద్యోగులు వేసిన పిటీషన్‌పై కోర్టు ఈ తీర్పును వెలువరించింది. చెన్నైకి చెందిన రామ్ కుమార్, రాజా బాబూ అనే వ్యక్తులు ఆ థియేటర్‌ను నడిపిస్తున్నారు. ఆ థియేటర్‌కు చెందిన యాజమాన్యం.. ఉద్యోగులకు ఈఎస్‌ఐ ఇవ్వలేదు. దాని వల్లే ఆ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. థియేటర్ ఉద్యోగులకు మొత్తం అమౌంట్‌ను చెల్లించేందుకు జయప్రద అంగీకరించింది. కేసును కొట్టివేయాలని ఆమె కోర్టును కోరింది. కానీ జయప్రద అభ్యర్థనను లేబర్ బీమా సంస్థ వ్యతిరేకించింది. దీంతో ఆ కేసులో జయప్రదతో పాటు మరో ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష విధించారు. ఆ ముగ్గురికి కూడా 5వేల జరిమానా విధించారు.

## ప్రముఖ అణు భౌతిక శాస్త్రవేత్త వికాస్ సిన్హా కన్నుమూత



కోల్‌కత, ఆగష్టు 11: ప్రముఖ అణు భౌతిక శాస్త్రవేత్త, పశ్చిమబెంగాల్ వాసి వికాస్ సిన్హా ఇక లేరు. 78 ఏళ్ల వికాస్ సిన్హా గత కొంత కాలంగా వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం ఉదయం కోల్‌కతాలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. అణు భౌతిక శాస్త్ర విభాగంలో ఆయన దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ, 2010లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.

అదేవిధంగా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కూడా ఇటీవల (2022లో) ఆయనను రాష్ట్ర అత్యున్నత పురస్కారమైన 'బంగభూషణ్' అవార్డుతో సత్కరించింది. ఆయన సేవలకు గుర్తింపుగా 2022లోనే రవీంద్ర స్మృతి పురస్కారాన్ని కూడా అందజేసింది. కాగా, వికాస్ సిన్హా మృతికి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## పార్లమెంట్‌లో బండి సంజయ్ వ్యాఖ్యలపై మండిపడ్డారు కేటీఆర్

హైదరాబాద్ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని మోదీని అవమానించారన్న కారణంతో కాంగ్రెస్ ఎంపీపై చర్యలు తీసుకున్నారని.. మరి ఇప్పుడు సీఎం కేసీఆర్‌పై అత్యంత నీచమైన భాషలో మాట్లాడిన బీజేపీ ఎంపీని ఏం చేయాలో స్పీకర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ శుక్రవారం ఉదయం ట్వీట్ చేశారు.'ప్రధాని ఇంటిపేరును అవమానకరంగా పిలిచినందుకు కాంగ్రెస్ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేశారు. ఇప్పుడు తెలంగాణకు చెందిన ఒక బీజేపీ ఎంపీ నిన్న లోక్ సభలో తెలంగాణ రాష్ట్రానికి రెండు సార్లు ఎన్నికైన పాపులర్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అత్యంత నీచమైన భాషలో దూషించారు. ఇప్పుడు లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఏం చేస్తారు..?' అని ట్విట్టర్ ద్వారా ప్రశ్నించారు.

## పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా

న్యూఢిల్లీ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ ): పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో భాగంగా లోక్‌సభ శుక్రవారంనాడు నిరవధికంగా వాయిదా పడింది. సభ నిరవధిక వాయిదాను స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. జూలై 20న ప్రారంభమైన లోక్‌సభ వర్షాకాల సమావేశాల్లో 17 సార్లు సభ సమావేశమైందని, 44 గంటల 15 నిమిషాలు సభ పనిచేసిందని ఆయన వివరించారు. 20 బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, 22 బిల్లులను సభ ఆమోదించినట్టు చెప్పారు. సభాకార్యక్రమాలు సజావుగా సాగేందుకు సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అన్ని పార్టీల నేతలు, ఎంపీలకు ఓం బిర్లా కృతజ్ఞతలు తెలిపారు.సభా కార్యక్రమాల్లో భాగంగా జూలై 26న కేంద్రంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని విపక్షాలు ప్రవేశపెట్టగా స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. దీనిపై మూడు రోజుల పాటు చర్చ జరిగింది. 60 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం మూజువాణి ఓటుతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. తీర్మానంలో భాగంగా మణిపూర్ హింసతో సహా పలు అంశాలపై అధికార, విపక్ష సభ్యులు తమ వాదనలతో సభను హోరెత్తించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక క్యాటగిరి హోదా కల్పించే విషయమై మోదీ ప్రభుత్వంపై తొలిసారి 2018లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా, ఆ తీర్మానం వీగిపోయింది.

## పాలమూరు ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతులు.. కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం!

హైదరాబాద్, ఆగష్టు 11:పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు మంజూరుకు ఎకానమిక్ అడ్వైజరీ కౌన్సిల్ (ఈఏసీ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనిపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

శుక్రవారం ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర రెడ్డితో కలిసి పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలోని కరివెన రిజర్వాయర్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం, జలాభిషేకం చేశారు.

ఎన్నో కేసులను ఎదుర్కొని, మరెన్నో అడ్డంకులను అధిగమించి, పోరాడి అనుమతులు సాధించడం చారిత్రక విజయంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పాలమూరు ప్రజల దశాబ్దాల స్వప్నం నెరవేరే రోజులు రావడంతో సంబురాలు చేసుకున్నారు.

పర్యావరణ అనుమతులు రావడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాలో 12.30లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే రెండవ దశ పనులు కూడా చకచకా ముందుకు సాగే అవకాశం ఏర్పడిందన్నారు.

# అవిశ్వాస తీర్మానం చర్చ..విపక్షాలపై విరుచుకుపడ్డ ప్రధాని మోడీ



### -ఆకలి గురించి కాంగ్రెస్‌కు పట్టదు ..
### -అధికార దాహంతో ఆ పార్టీ తహతహ..
### -మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టి కృషి..
### -90 నిమిషాల వరకూ ఉద్దేశపూర్వకంగానే మణిపూర్ ప్రస్తావన తీసుకురాలేదు..
### -మోదీ బదులిచ్చిన తీరు పట్ల విపక్షాలు పెదవివిరుపు..
### -ఇండియా కూటమి ఎంపీలు సభ నుంచి వాకౌట్..

న్యూఢిల్లీ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ బదులిచ్చిన తీరు పట్ల విపక్షాలు పెదవివిరిచాయి. ప్రధాని ప్రసంగంలో పస లేదని మణిపూర్ హింసాకాండపై ఆయన ప్రసంగంలో 90 నిమిషాల పాటు ఎలాంటి ప్రస్తావన లేదని ఆక్షేపించింది. సభ నుంచి ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం ఈ అంశాన్ని ప్రస్తావించారని మండిపడింది.ప్రధాని మోదీ అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు బదులిస్తుండగా విపక్ష ఇండియా కూటమి ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రధాని తన ప్రసంగం ప్రారంభించిన 90 నిమిషాల వరకూ ఉద్దేశపూర్వకంగానే మణిపూర్ ప్రస్తావన తీసుకురాలేదని విపక్ష ఎంపీలు వాకౌట్ చేసిన తర్వాత తన వైఖరి మార్చుకుని ఈశాన్య రాష్ట్రంలో అల్లర్ల గురించి ప్రస్తావించారని టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రైన్ మండిపడ్డారు. మోదీ ప్రసంగంలో టెఫ్లాన్ కోటింగ్ అదృశ్యమైందని, మునుపటి జోష్, మెరుపు మాయమయ్యాయని అన్నారు.మోదీజీ ఇవాళ్టి మీ ప్రసంగంతో విపక్ష కూటమి ఇండియా విజయం తథ్యమనే విశ్వాసం పెరిగిందని జీతేగా భారత్ అంటూ వీడియో మెసేజ్‌లో ఒబ్రైన్ పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మోదీ రాజ్యసభ ముఖం చూడలేదని అన్నారు. లోక్‌సభలో మణిపూర్ గురించి కేవలం 4 నిమిషాలే మాట్లాడారని, స్వాతంత్ర్యం అనంతరం మోదీ కంటే ఏ ఒక్క ప్రధాని పార్లమెంట్‌ను ఇంతలా అవమానించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ప్రధాని మోదీ తన ప్రసంగంలో విపక్షాలపై ప్రధానంగా కాంగ్రెస్‌పై విమర్శల దాడితో విరుచుకుపడ్డారు. పేదల ఆకలి గురించి కాంగ్రెస్‌కు పట్టదని, అధికార దాహంతో ఆ పార్టీ తహతహలాడుతుందని ఆరోపించారు. మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా పనిచేస్తున్నాయని అన్నారు.

## ఐసిస్ ఉగ్రదాడి - 23 మంది సిరియా సైనికులు మృతి

న్యూఢిల్లీ, ఆగష్టు 11:సిరియా తూర్పు ప్రాంతంలో సిరియా సైనికులు ప్రయాణిస్తున్న బస్సుపై ఐసిస్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో 23 మంది సిరియన్ సైనికులు మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. ఐసిస్ ఆధీనం నుంచి 2017లో ఇరాన్, 2019లో సిరియా బయటపడ్డాయి. అప్పటి నుంచి సిరియాలో వరుస దాడులు జరుగుతున్నాయి. గత కొంతకాలంగా సిరియాపై ఐఎస్?ఐఎస్? ఉగ్రసంస్థ దాడులకు పాల్పడుతోంది. అలాగే స్లీపర్ సెల్స్‌తో దాడులు చేయిస్తోంది.

ఇరాక్‌తో సరిహద్దుగా ఉన్న డీర్ ఎల్-జోర్ ప్రావిన్స్‌లోని తూర్పు పట్టణం మయాదీన్ సమీపంలోని ఎడారి రహదారిపై జరిగిన దాడిలో 23 మంది సిరియన్ సైనికులు మరణించారని, 10 మంది గాయపడ్డారని బ్రిటన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ తెలిపింది. జిహాదీలు బస్సును చుట్టుముట్టి కాల్పులు జరిపిన దాడి తర్వాత డజన్ల కొద్దీ సైనికులు కనిపించకుండా పోయారని పేర్కొంది .

## అమరరాజా ఇంధన పరిశోధన, ఆవిష్కరణ కేంద్రానికి కెటీఆర్ భూమి పూజ



హైదరాబాద్, ఆగష్టు 11:రాష్ట్రంలో పరిశ్రమల కోసం అద్భుతమైన ఎకో సిస్టమ్ ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. మొబిలిటీ రంగంలోనూ తెలంగాణ అగ్రగామిగా నిలుస్తున్నదని చెప్పారు. గిగా కారిడార్‌లో భాగంగా హైదరాబాద్‌లోని జీఎంఆర్ ఏరోసిటీలో అమరరాజా బ్యాటరీస్ లిమిటెడ్ నిర్మిస్తున్న అధునాతన ఇంధన పరిశోధన, ఆవిష్కరణ కేంద్రానికి మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొబిలిటీ వ్యాలీని ప్రారంభించిందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల కోసం జహీరాబాద్‌ను ఎంపిక చేశామని తెలిపారు. యువ నైపుణ్యాన్ని ఒడిసిపట్టడంలో టీఎస్ఐసీ కృషిచేస్తున్నదని వెల్లడించారు.

ఎలక్ట్రికల్ రంగంలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని చెప్పారు. 2030 నాటికి 60 శాతం ఈ-బ్యాటరీలు దేశంలోనే తయారవుతాయని చెప్పారు. పరిశోధన, డిజైన్, ఇంజినీరింగ్ రంగాల్లో హైదరాబాద్ ముందంజలో ఉందని చెప్పారు. ప్రపంచానికి వ్యాక్సిన్ రాజధానిగా హైదరాబాద్ నిలుస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెడుతున్న జయదేవ్ గల్లాకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిరోజు కొత్తదనం ఉండేలా అమరరాజా కృషి చేస్తున్నదని చెప్పారు. రెండు రోజుల క్రితం కోల్డ్‌చైన్ సెంటర్‌ను ప్రారంభించుకున్నామని తెలిపారు. ఎనర్జీ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

# ఐపీసీ, సీసీపీ ఐఈఏలకు గుడ్ బై...

### -వీటి స్థానాల్లో 'భారతీయ న్యాయ సంహిత' కొత్త చత్తం
### - మైనర్లను అత్యాచారం చేస్తే ఉరిశిక్ష.
### - సామూహిక అత్యాచారానికి పాల్పడితే 20 ఏళ్ల జైలు.
### -మూక దాడులకు ఏడేళ్ల జైలు.
### -కీలకమైన మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం సంచలనానికి తెరదీసింది. బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ క్రిమినల్ చట్టాలైన ఐపీసీ, సీసీపీ ఐఈఏ స్థానాల్లో కొత్త చట్టాలను



ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ఐపీసీ స్థానంలో 'భారతీయ న్యాయ సంహిత' (కొత్త చట్టాన్ని తీసుకోరాబోతోంది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలకమైన మూడు బిల్లులను నేడు (శుక్రవారం) లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ స్థానంలో 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత', ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో 'భారతీయ సాక్ష్య' చట్టాలకు సంబంధించిన బిల్లులను సభలో ప్రవేశపెట్టారు.ఇక శాంతి భంగం కలిగించే నేరాలు, సాయుధ తిరుగుబాటులు, విధ్వంసకర చర్యలు, విజభనవాద కార్యకలాపాలు లేదా భారత ఐక్యత, సమగ్రతకు సంబంధించిన చట్టాలను సవరించిన చట్టాలలో చేర్చనున్నారు. మరోవైపు మహిళలు, పిల్లలు, హత్యలు, ప్రభుత్వ వ్యతిరేక నేరాలను కొత్త బిల్లుల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇక తొలిసారిగా చిన్నచిన్న నేరాలకు సంఘసేవను శిక్ష విధించబోతున్నారు. అంతేకాదు.. లింగసమానత్వంతో కొత్తచట్టాలను రూపొందించారు.ఇక వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలు, ఉగ్రవాదానికి సంబంధించిన కొత్త కార్యకలాపాలను నియంత్రించేలా కఠినమైన శిక్షలను చేర్చారు. అంతేకాదు.. వేర్వేరు నేరాలకు సంబంధించిన జరిమానాలు, శిక్షలను పెంచారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను ప్రక్షాళన చేసి కొత్తవాటిని ప్రవేశపెట్టడమే లక్ష్యమని ఈ సందర్భంగా లోక్‌సభలో అమిత్ షా వ్యాఖ్యానించారు. కాగా ఇండియన్ పీనల్ కోడ్‌ను 1860లో ప్రవేశపెట్టారు.

**మూడు బిల్లుల్లోని ముఖ్యమైన మార్పులు..**

-మైనర్లను అత్యాచారం చేస్తే ఉరిశిక్ష.
-సామూహిక అత్యాచారానికి పాల్పడితే 20 ఏళ్ల జైలు.
-మూక దాడులకు ఏడేళ్ల జైలు.
-7 సంవత్సరాలకుపైగా శిక్ష విధించే కేసుల్లో ఫోరెన్సిక్ సాక్ష్యాలు తప్పనిసరి.
-ఎక్కడి నుంచైనా ఈ-ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు.
-సెర్చ్ ఆపరేషన్ చేస్తే సెర్చ్ వారెంట్‌తోపాటు ఎవరి వద్దకైనా వెళ్తే వీడియోగ్రఫీ చేయాల్సిందే.
-ఎఫ్ఐఆర్ నుంచి ఛార్జిషీట్ వరకు అన్ని డిజిటలైజ్ చేయాలి.

## మాదాపూర్ నారాయణ కాలేజ్ విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణ కాలేజ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అయ్యప్ప సొసైటీల వద్ద ప్రణవి క్యాంపస్‌లో చదువుతున్న విద్యార్థి గంటా కనక రాజు (17) ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ నెల 8వ తేదీన నారాయణ కాలేజ్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కనకరాజు జాయిన్ అయ్యారు. తను చదువుతున్న క్యాంపస్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన సిబ్బంది చికిత్స నిమిత్తం మాదాపూర్ మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు మాదాపూర్ పోలీసులు తెలిపారు.

# నిరుద్యోగంతో యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నామా?!

## (12 ఆగష్టు "అంతర్జాతీయ యువజన దినోత్సవం" సందర్భంగా)

నేటి బాలలే రేపటి పౌరులు. నేటి నైపుణ్య యువతే రేపటి ప్రపంచ సుస్థిరాభివృద్ధి వెలుగులు. సృజన, విలక్షణ ఆలోచనలతో కూడిన యువశక్తితో డిజిటల్ యుగపు మానవాళి కృత్రిమ మేధ ఇంధనంగా మరో ప్రపంచాన్ని చూడనున్నది. ప్రస్తుతం నెలకొన్న పేదరికం, ఆర్థిక సామాజిక అసమానతలు, నిరక్షరాస్యత, జనాభా విస్ఫోటనం, ప్రజారోగ్య సంక్షోభం, ప్రపంచ అశాంతి లాంటి తీవ్ర సమస్యలతో సతమతమవుతున్న ఆధునిక ప్రపంచాన్ని నేటి యువతీయువకులు శాస్త్రసాంకేతిక నైపుణ్యాలను రెక్కలుగా చేసుకొని, సన్మార్గంలో వాయువేగంతో దూసుకుపోతూ సమాజానికి నవ్య ఊపిరులు ఊదడానికి సన్నద్ధం కావాలని ఐరాస భావిస్తున్నది. యువతలో కర్తవ్యాన్ని జాగృత పరిచి, భాద్యతలను అవగాహన పరిచి, రేపటి సుఖమయ జీవితాలకు గొడుగులు పట్టి, ప్రపంచ మానవాళికి కొత్త దారులు చూపుతూ సారథ్యం వహించేలా తయారు చేయడానికి ఐరాస సర్వసభ్య సమావేశం 1999లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 12 ఆగష్టు రోజున "అంతర్జాతీయ యువజన దినోత్సవం(ఇంటర్నేషనల్ యూత్ డే)" ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

**అంతర్జాతీయ యువజన దినం–2023 నినాదం:**

ప్రపంచం నేడు పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ప్రతికూల వాతావరణాలు, అకారణ ఆధిపత్యం కోసం భీకర యుద్ధాలు, విపత్తులు, కాలుష్య భూతాలు లాంటి భయానక భవిష్యత్తు హెచ్చరికల నడుమ రేపటి ఆరోగ్య ధరణికి గొడుగులు పట్టడం నేడు తక్షణావసరంగా మారిందని యువత గమనించాలి. పర్యావరణహిత సుస్థిరాభివృద్ధి మార్గంలో నడవవలసిన సమయం ఆసన్నమైందనా గమనించిన ఐరాస నేడు గ్రీన్ డెవలప్‌మెంట్ మంత్రం జపిస్తున్నది. ఈ నేపథ్యంలో అంతర్జాత యువజన దినం – 2023 నినాదంగా "సుస్థిరాభివృద్ధి సాధనలో హరిత నైపుణ్యాల యువత (గ్రీన్ స్కిల్స్ ఫర్ యూత్ : టువర్డ్స్ ఏ సస్టేనబుల్ వరల్డ్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ శాంతి స్థాపనలో యువ శాంతి కిషోరాలుగా మారి ఉగ్రవాదం, తీవ్రవాదం, యుద్ధ వాతావరణాలను అర్థం చేసుకుంటూ భూమాత చుట్టు శాంతి కపోతాలు స్వేచ్ఛగా ఎగిరేలా వాతావరణం కల్పించేలా యువత కార్యోన్ముఖులు కావాలని ఐరాస భావిస్తున్నది.

**140 కోట్ల ప్రపంచ యువశక్తి:**

ప్రపంచవ్యాప్తంగా 15 నుంచి 24 ఏండ్ల వయసున్న వ్యక్తులను యువతీయువకులుగా యునెస్కో నిర్వచించింది. ప్రపంచ జనాభాలో 16 – 17 శాతం, అనగా దాదాపు 1.4 బిలియన్ల యువ జనాభా ఉన్నది. అంతర్జాల విప్లవంతో సమసిపోయిన దేశ, ఖండ, ప్రాంత సరిహద్దులతో యువత ప్రపంచాన్ని చుట్టేస్తూ సుస్థిరాభివృద్ధిలో సింహభాగం తీసుకుంటున్నది. ఆధునిక యువతలో అవసర నైపుణ్యాలను పెంచుతూ, విలువలు కలిగిన అంతర్జాతీయ స్థాయి విద్యను బోధిస్తూ, సమన్వయ భావనను జాగృత పరుస్తూ, మానవాళి సమస్యల పరిష్కారాల దిశగా ఆలోచనలు చేస్తూ, పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో పాలుపంచుకుంటూ, విజేతను ప్రోత్సహిస్తూ, సృజనకు పునాదులు వేస్తూ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తూ, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పరిపూర్ణ పౌరులుగా తయారు చేయడానికి ప్రపంచ దేశాలు ప్రాధాన్యం ఇవ్వాలి. హరిత అభివృద్ధికి సంబంధించిన పరిజ్ఞానం, అంతర్జాతీయ స్థాయిలో మానవీయ విలువల వికాసం, భాద్యతల పట్ల అంకితభావం, సమాజం పట్ల సదాలోచనలు ప్రస్తుత యువతలో జనించేలా విద్యా బోధనలు కొనసాగాలి. 'స్కిల్స్ ఫర్ ఫ్యూచర్', 'స్కిల్స్ ఫర్ గ్రీన్ జాబ్స్' లాంటి నూతన భావనల పట్ల సంపూర్ణ అవగాహన కలిగించాలి. వ్యక్తిత్వ వికాసం, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను అందించడం, ఉన్నత విద్యలో నిష్ణాతులుగా మార్చడం నేటి విద్యాసంస్థల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు తరగని ఇంధనాల వినియోగం, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గిస్తూ, జీరో కార్బన్ ఉద్గార స్థాయికి చేరడానికి ముమ్మర ప్రయత్నాలను చేయడం నేటి యువత కర్తవ్యంగా తీసుకోవాలి.

**యువతలో గ్రీన్ స్కిల్స్ సాధన:**

పునరుత్పాదక శక్తి వనరులను అభివృద్ధి చేయడానికి కావలసిన విజ్ఞానం, సామర్థ్యం, దృక్పథం, గ్రీన్ విలువలు కలిగిన యువతను సన్నద్ధం చేయడం తక్షణమే జరగాలి. కార్చిచ్చులు, కరువులు, వడగాలులు, తీవ్ర అకాల వర్ష వరదలు, వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి తగ్గడం లాంటి సమస్యలను అధిగమించడానికి ప్రతి 10 మంది ప్రపంచ యువతలో 7గురు హరిత అభివృద్ధి దిశగా ప్రయాణించడం జరగాలి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంబంధ అవకాశాలను అర్థం చేసుకుంటూ యువత జాగ్రత్తగా అడుగులు వేయాలి. 2030 నాటికి వాతావరణ మార్పుల కారణంగా 40 శాతం ఉద్యోగ ఉపాధులు కోల్పోయే ప్రమాదం ఉందని, గ్రీన్ స్కిల్స్ విభాగంలో 8.4 మిలియన్ల ఉద్యోగాలు కల్పించబడతాయని తెలుసుకోవాలి. గ్రీన్ జాబ్స్ పెరిగితే ఇతర అనుబంధ రంగాల్లో కూడా ఉద్యోగాలు పెరగడం జరుగుతుందని నమ్మాలి. నేడు గ్రీన్ స్కిల్స్ డిమాండ్ కన్న సప్లై తక్కువగా ఉన్నది. దాదాపు 60 శాతం యువత గ్రీన్ ఎకానమీకి కావలసిన నైపుణ్యాలకు దూరంగా ఉన్నారు. గత ఏడాది యువతలో గ్రీన్ టాలెంట్ 12 శాతం పెరగడం గమనించారు. దాదాపు 67 శాతం యువతలో డిజిటల్ నైపుణ్యాల స్థాయి తక్కువ ఉన్నాయని, 2015–21 మధ్య 66 శాతం గ్రీన్ జాబ్స్ పెరిగాయని, 19 మిలియన్ల గ్రీన్ ఉద్యోగుల్లో 6 మిలియన్లను మాత్రమే మహిళలు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నేడు గ్రీన్ ఎనర్జీని సమర్థవంతంగా బోధించే విశ్వవిద్యాలయాలు లేకపోవడం విచారకరమని, హరిత విజ్ఞానంతో సాధించే అభివృద్ధి మాత్రమే ఆమోదయోగ్యమైనదిగా గుర్తించబడే రోజులు సమీప భవిష్యత్తులో రానున్నాయని తెలుస్తున్నది.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణ రంగం ప్రముఖులు, ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం చేసే వ్యక్తులకు వర్తించే అదనపు మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగష్టు 10:ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణ రంగం ప్రముఖులు, ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం చేసే వ్యక్తులకు వర్తించే అదనపు మార్గదర్శకాలను వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న వినియోగదారుల వ్యవహారాల శాఖ విడుదల చేసింది. తప్పుదోవ పట్టించే విధంగా విడుదల అవుతున్న నిరోధానికి జారీ చేసిన 2022 జూన్ 9న జారీ చేసిన మార్గదర్శకాలకు అదనంగా వినియోగదారుల వ్యవహారాల శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. 2023 జనవరి 20న విడుదల చేసిన "ఎండార్స్‌మెంట్ నో–హౌస్!" గైడ్ బుక్‌లెట్ స్థానంలో నూతన మార్గదర్శకాలు అమల్లోకి వస్తాయి.

ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఈఎస్ఎస్ఎఐ), అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (యాఎఐ) సహా అన్నిసంబంధిత వర్గాలతో సవివరంగా చర్చించిన తర్వాత ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణ రంగం ప్రముఖులు, ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం చేసే వ్యక్తులకు వర్తించే అదనపు మార్గదర్శకాలను వినియోగదారుల వ్యవహారాల శాఖ సిద్ధం చేసింది.

ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలకు అనుకూలంగా సాగుతున్న ప్రచారం పారదర్శకంగా సాగే విధంగా చూసి, తప్పుదోవ పట్టించే ప్రకటనలు,నిరాధారమైన ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో మార్గదర్శకాలు రూపొందాయి. నూతన మార్గదర్శకాల ప్రకారం, సమాచారాన్ని పంచుకున్నప్పుడు, ఉత్పత్తులు లేదా సేవలను ప్రమోట్ చేస్తున్నప్పుడు లేదా ఏదైనా ఆరోగ్య సంబంధిత క్లెయిమ్‌లు చేస్తున్నప్పుడు, గుర్తింపు పొందిన సంస్థల నుండి ధృవీకరణ పత్రాలు కలిగి ఉన్న ధృవీకరించబడిన వైద్య అభ్యాసకులు, ఆరోగ్యం,ఫిట్‌నెస్ నిపుణులు తప్పనిసరిగా తాము ధృవీకరించబడిన ఆరోగ్య/ఫిట్‌నెస్ నిపుణులు మరియు వైద్య అభ్యాసకులు అని తెలియజే యాల్సి ఉంటుంది. ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, ఉత్పత్తులు లేదా సేవలను ప్రచారం చేస్తున్నప్పుడు ఉత్పత్తులు, సేవలు, కార్యక్రమాలతో తమకు సంబంధం లేదని ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణ రంగం ప్రముఖులు, ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం చేసే వ్యక్తులు స్పష్టంగా ప్రకటించాల్సి ఉంటుంది. తమ ప్రచారాలు ప్రజలు వృత్తిపరమైన వైద్య సలహా, రోగ నిర్ధారణ లేదా చికిత్స కోసం ప్రత్యామ్నాయంగా చూడకూడదని ప్రేక్షకులు అర్థం చేసుకునేలా ప్రవర్తించాల్సి ఉంటుంది.

ఆహార పదార్థాలు , న్యూట్రా స్యూటికల్స్, వ్యాధి నివారణ, చికిత్స లేదా నివారణ, వైద్య పరిస్థితులు, రికవరీ పద్ధతులు లేదా రోగనిరోధక శక్తిని పెంచడం మొదలైన వాటితో సహా ఆరోగ్య ప్రయోజనాలు వంటి అంశాలపై మాట్లాడేటప్పుడు లేదా అనుకూల ప్రచారం చేస్తున్నప్పుడు ఈ బహిర్గతం లేదా నిరాకరణ అవసరం. ఈ బహిర్గతం లేదా నిరాకరణ ఎండార్స్‌మెంట్‌లు, ప్రమోషన్‌లు లేదా ఆరోగ్య సంబంధిత ప్రకటనలు ప్రసారం అవుతున్న సమయంలో ప్రదర్శిం చాల్సి ఉ ంటుంది. .

'నీరు తాగండి దప్పిక తీర్చు కోండి ', 'క్రమంగా వ్యాయామం చేయండి మరియు శారీరకంగా చురుకుగా ఉండండి', 'కూర్చోవడం టీవీ చూసే సమయాన్ని తగ్గించడండి' 'తగినంత మంచి నిద్ర పొందండి', 'త్వరగా కోలుకోవడానికి పసుపు పాలు త్రాగండి', ఊవి కిరణాల రక్షణ పొందడానికి ప్రతిరోజూ సన్‌స్క్రీన్ ఉపయోగించండి' 'మెరుగైన పెరుగుదల కోసం జుట్టుకు నూనె రాయండి' లాంటి సాధారణ ప్రకటనలు, నిర్దిష్ట ఉత్పత్తులు లేదా సేవలతో సంబంధం కలిగి ఉండని లేదా నిర్దిష్ట ఆరోగ్య పరిస్థితులు లేదా ఫలితాలు లక్ష్యంగా చేసుకోని వెలువడే ప్రకట నలు ఈ నిబంధనల పరిధిలోకి రావు.

తమను తాము ఆరోగ్య నిపుణులు లేదా మెడికల్ ప్రాక్టీషనర్లుగా చూపించుకుంటూ ప్రచారం నిర్వహించే ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణ రంగం ప్రముఖులు, ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం చేసే వ్యక్తులు వారి వ్యక్తిగత అభిప్రాయాలు మరియు వృత్తిపరమైన సలహాల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించి, నిరూపితమైన వాస్తవాలు లేకుండా నిర్దిష్ట ఆరోగ్య ప్రచారాలు చేయడానికి దూరంగా ఉండాలని మార్గదర్శకాలు పేర్కొన్నాయి. వృత్తిపరమైన వైద్య సలహా, ఉత్పత్తులు లేదా సేవల గురించి పూర్తి సమాచా రం కోసం ఆరోగ్య సంరక్షణ నిపుణులను సంప్రదించే విధంగా ప్రేక్షకులను ప్రోత్సహించాలని మార్గదర్శకాల్లో సిఫార్సు చేశారు. .

వినియోగదారుల వ్యవహారాల శాఖ మార్గదర్శకాల అమలును ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుంది. అమలు చేస్తుంది. ఉల్లంఘనలకు వినియోగదా రుల రక్షణ చట్టం 2019 మరియు చట్టంలోని ఇతర సంబంధిత నిబంధ నల ప్రకారం జరిమానా విధిస్తారు.

వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి మరియు సరసమైన, పారదర్శక మార్కెట్‌ను ప్రోత్సహించడానికి వినియోగదారుల వ్యవహారాల శాఖ కృషి చేస్తోంది. పెరుగుతున్న ప్రభావవంతమైన డిజిటల్ నేపథ్యంలో ఈ మార్గదర్శకాలు పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడి, వినియోగదారుల ప్రయోజనాలను రక్షిస్తాయి.

# 27 నుంచి యాదాద్రి ఆలయంలో పవిత్రోత్సవాలు..పలు సేవలు రద్దు

యాదగిరి గుట్ట, భువనగిరి, ఆగష్టు 10: యాదాద్రి, భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి రెండు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహాణాధికారి ఎన్.గీత వెల్లడించారు. ప్రతి సంవ త్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడ ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా మని తెలిపారు.

ఈ రెండు రోజుల పాటు శ్రీ స్వామి వారి నిత్య, శాశ్వత కల్యాణం , నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవం లక్షపు ష్పార్చన, శ్రీ సుదర్శన నారసింహ హోమాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. 29 నుంచి యథా విధిగా శ్రీ స్వామి వారి నిత్యకైం కర్యములు జరుగుతాయని పేర్కొన్నారు.

# ఎస్వీ మ్యూజియం పనులకు శంకుస్థాపన చేసిన చైర్మన్ భూమన



తిరుపతి, ఆగష్టు 10:ఎస్వీ మ్యూజియం పనులుకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ? శ్రీవారి ఆలయ ప్రాశస్త్యాన్ని భక్తులకు తెలిపేలా ఎస్వీ మ్యూజియంని అభివృద్ధి చేస్తామన్నారు.

రూ.145 కోట్ల వ్యయంతో మ్యూజియాన్ని ఆధునాతనమైన సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామన్నారు. టీసీయస్, మ్యాప్స్ సంస్థ రూ.145 కోట్ల విలువైన పనులను విరాళంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ కల్లా మ్యూజియం అభివృద్ధి పనులు పూర్తి చేసేలా కార్యచరణ రూపొందించామని ఆయన తెలిపారు.

# ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



మెదక్, ఆగష్టు 10:(నేటినిజం ప్రతినిధి):వివిధ పార్టీల నాయకులు గ్రామాల అభివృద్ధిని ఆకాంక్షించి బీఅర్ఎస్‌లో చేరడం అభిందనీయమని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హవేలీఘనపూర్, మెదక్ మండలంలోని నాగపూర్, తిమ్మనగర్, మక్తభూపతిపూర్ గ్రామాలకు చెందిన 100 మంది కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చి బీఆర్ఎస్‌లో చేరారు.

వారికి గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీలోనే ప్రతి కార్యకర్తకు సరైన గౌరవం ఉంటుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ లావణ్య రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ శ్రీహరి, వైస్ చైర్మన్ పురం శంకర్, మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి, యం.అంజా గౌడ్, నాగపూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రాములు,మక్త భూపతిపూర్ సర్పంచ్ సుంకరి నర్సింలు, నాయకులు ఆనంద్, రాంచంద్రారెడ్డి, మ్యాకల సాయిలు, సాంబశివరావు, బాలయ్య, ఆంజనేయులు, సాప శ్రీనివాస్, షాకీర్, నర్సింలు, కిష్టయ్య, రవికుమార్, పోచయ్య బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారం కోసం బడుగు బలహీన వర్గాలు బానిస భావన విడనాడాలి

## – ఓట్లు విప్లవం ద్వారానే రాజ్యాధికారం సాధ్యం
## – బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు బొల్క వెంకట్ యాదవ్

హైదరాబాద్, ఆగష్టు 10:మన రాష్ట్రంలో దాదాపు 24 శాతం దళితులు, 54 శాతం బిసిలు, 12 శాతం ముస్లిం మైనారిటీలు, ఇతరులు కూడా ఒకటి, రెండు శాతం ఉన్నారు. దాదాపు 90 శాతం పైగా ఉన్న అణగారిన వర్గాలు ఒకటి, రెండు శాతం ఉన్న వర్గాలను యాచించే పరిస్థితి కొనసాగుతుందని బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు బొల్క వెంకట్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేసారు.. మైనారిటీ కులాలైన కమ్మలు వెలమలు వైశ్యులు బ్రాహ్మణులు రెడ్ల ను మాకు ఆ పథకం కావాలి, ఈ పథకం కావాలి, కార్పొరేషన్లు కావాలి అని గత 75 సంవత్సరాలుగా అడుగుతూనే ఉన్నాం. వారు కనీసం ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించింది కూడా లేదన్నారు.అధికారం లో ఉన్న వారి సామాజిక వర్గాలు కీలకమైన పదవులు అనుభవిస్తూ తమ సామాజిక వర్గాలకి తక్కువ ధరకు భూములు కేటాయించడం, పరిశ్రమలకు, సబ్సిడీలు, అనుమతులు మంజూరు చేసి దినదినాభివృద్ధి చెందడం. వారి వద్ద మనం కూలి పనులు చేసుకుంటూ వెట్టిచాకిరి చేస్తూ, దుర్భర పరిస్థితుల్లో జీవనాలు కొనసాదిస్తున్నరన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేసి, అధికారంలో ఉన్న వారు సొంత ఖర్చులకు వాడుకుని మిగతాది వారి పేర్లు, వారి తండ్రి తాతల పేర్లు తో పథకాలు తయారు చేసి మనకు తిరిగి ఇస్తూ, ఒకరు మార్చి ఒకరు అధికారంలోకి రావడానికి వారి సొంత డబ్బు మనకు ఇస్తున్నట్లు అసత్య ప్రచారాలు చేసుకుని మనల్ని నమ్మించడం జరుగుతుంది. అది నిజమని మనం నమ్మడం మన అవివేకం అవుతుందన్నారు.బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తూ మన అభివృద్ధికి అడ్డంకులు సృష్టించడం, మన మీదే దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, మానభంగాలు లూటీలు కబ్జాలు చేయడం నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంది. అలాంటి దౌర్జన్యాలు, కబ్జాలకు కూడా బిసి ఎస్సీ ఎస్టీలను పావులుగా వాడుకోవడం జరుగుతుంది. ఒకవేళ ఉన్నత కులాల వారు నేరుగా దాడులు, దౌర్జన్యాలు చేసినా రాజ్యాధికారం వారి చేతుల్లో ఉండటం వల్ల వారు తప్పించుకోవడం జరుగుతుందన్నారు. బిసిలు ఎస్సీ ఎస్టీ మరియు మైనారిటీలు అంతర్గత ఐక్యత సాధించాలి. రాజ్యాధికారం కోసం బడుగు బలహీన వర్గాలు చేయి చేయి కలిపి బానిస భావన నుంచి బయటపడాలి. బడుగు బలహీన వర్గాలు అధికారం లో ఉన్నప్పుడు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా జనాభా ప్రాతిపదికన ప్రతి ఒక్కరూ ( ఉన్నత కులాల సహా) తమ హక్కులు సాధించుకోవడానికి వీలౌతుందన్నారు.

# కేంద్ర మంత్రి శ్రీ భగవంత్ ఖుబా సమక్షంలో ప్రారంభమైన కర్టెన్ రైజర్ ఆఫ్ ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2023

న్యూఢిల్లీ, ఆగష్టు 10:"2050 నాటికి యూఎస్ డి50 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేయబడిన మార్కెట్ పరిమాణంతో భారతదేశం వైద్య సాంకేతికత మరియు పరికరాల గ్లోబల్ హబ్‌గా మారనుంది" అని గాంధీనగర్‌లో జరగనున్న కర్టెన్ రైజర్ ఆఫ్ ఇండియా మెడికల్ టెక్నాలజీ ఎక్స్‌పో 'ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2023'లో ఈ రోజు తన ప్రసంగంలో కేంద్ర ఆరోగ్య ఉ కుటుంబ సంక్షేమం మరియు రసాయనాలు ఉ ఎరువుల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా తెలిపారు. జీ20 ఆరోగ్య మంత్రుల సమావేశం సందర్భంగా ఆగష్టు 17 నుండి 19 వరకు గుజరాత్‌లో ఇది నిర్వహించబడుతుంది.కార్యక్రమంలో ఆయనతో పాటు కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీ భగవంత్ ఖుబా కూడా పాల్గొన్నారు.

డాక్టర్ మాండవ్య మాట్లాడుతూ "దేశంలోని సూర్యోదయ రంగాలలో వైద్య పరికరాల రంగం ఒకటిగా పరిగణించబడుతుంది. భారతదేశాన్ని వైద్య పరికరాల తయారీ కేంద్రంగా మార్చడానికి గౌరవనీయులైన ప్రధాన మంత్రి ఆధ్వర్యంలోని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది'' అని అన్నారు. "1.5 శాతం మార్కెట్ వాటా నుండి రాబోయే 25 సంవత్సరాలలో భారతదేశ మార్కెట్ వాటాను 10-12 శాతానికి పెంచాలని మేము ఆశిస్తున్నాము" అని ఆయన చెప్పారు. "ఇటీవల ఆవిష్కరించబడిన నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీ 2023 యొక్క సమర్థవంతమైన అమలుతో 2030 నాటికి వైద్య పరికరాల రంగం వృద్ధిని ప్రస్తుత డి11 బిలియన్ల నుండి డి50 బిలియన్లకు పెంచగలమని మేము విశ్వసిస్తున్నాము'' అని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి మాట్లాడుతూ "ఇంతకుముందు మనం ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలతో సహా ఆరోగ్య రంగంలోని వివిధ విభాగాలను సిలోస్‌లో చూశాము. మోదీ ప్రభుత్వ హయాంలో 2047 నాటికి దేశంలోని ఆరోగ్య రంగాన్ని మార్చాలనే దృక్పథంతో భారతదేశం ఆరోగ్యానికి సమగ్ర విధానాన్ని తీసుకుంటోంది. "పిఎల్ఐ పథకం వంటి ప్రభుత్వం చేపట్టిన అనేక కొత్త కార్యక్రమాలు విదేశాల నుండి దిగుమతి చేసుకున్న 43 కీలకమైన ఏపిఐలను దేశంలో ఉత్పత్తి చేయడానికి దారితీశాయి. ఈ రంగంలో భారతదేశాన్ని స్వావలంబనగా మార్చడానికి ప్రభుత్వం దేశంలో బల్క్ డ్రగ్ పార్కులు మరియు వైద్య పరికరాల పార్కులను కూడా సృష్టిస్తోంది." అని తెలిపారు.

రాబోయే మెడ్‌టెక్ ఎక్స్‌పో 2023లో వైద్య మరియు శస్త్ర చికిత్సలు, మందులు, పరికరాలు మరియు సౌకర్యాలలో భారతదేశం యొక్క ఆవిష్కరణలు మరియు విజయాలను ప్రదర్శిస్తుందని డాక్టర్ మాండవియా పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భారతదేశంలోని వైద్య పరికరాల పర్యావరణ వ్యవస్థ యొక్క దృశ్యమానతను మెరుగుపరుస్తుందని మరియు భారతీయ మెడ్‌టెక్ రంగానికి బ్రాండ్ గుర్తింపును సృష్టిస్తుందని ఆయన హైలైట్ చేశారు.

ఆరోగ్య రంగంలో దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చేందుకు గౌరవనీయులైన ప్రధాన మంత్రి నాయకత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ భగవంత్ ఖుబా అన్నారు. పరిశ్రమలు మరియు మీడియా సిబ్బందితో సహా వాటాదారులందరూ ఎక్స్‌పోను సందర్శించి ఈ విభాగంలో జరుగుతున్న పరివర్తనాత్మక పనులను వీక్షించాలని ఆయన కోరారు.

ఫార్మాస్యూటికల్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ శ్రీమతి ఎస్ అపర్ణ మాట్లాడుతూ..నేడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగాల్లో వైద్య పరికరాల రంగం ఒకటి. వైద్య పరికరాల దేశీయ తయారీకి పరిశ్రమకు ప్రోత్సాహాన్ని అందించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమాలు ఇంతకుముందు దిగుమతి చేసుకున్న 37 ప్రత్యేకమైన ఉత్పత్తులకు దారితీశాయి. ఇప్పుడు దేశీయంగా తయారు చేయబడ్డాయని తెలిపారు.

కేంద్ర ఫార్మా సెక్రటరీ ఈ "వైద్య పరికరాల తయారీ మరియు డిమాండ్ వైపు రెండింటినీ తీర్చడానికి ఈ విధాన జోక్యాలు చేయబడుతున్నాయి" అని పేర్కొన్నారు. వైద్య పరికరాల తయారీ కోసం దేశవ్యాప్తంగా నాలుగు కొత్త పారిశ్రామిక పార్కులను నిర్మిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. "వైద్య పరికరాల ఎగుమతులను పెంచేందుకు ఇటీవల జాతీయ వైద్య పరికరాల ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్‌ను కూడా ఏర్పాటు చేశారు'' అని ఆమె తెలిపారు. ఎక్స్‌పోలో ఫ్యూచర్ పెవిలియన్ మరియు ఆర్‌డడి పెవిలియన్ ఉంటుందని మరియు రాష్ట్రాలు, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, అకాడెమియా మరియు ఇన్నోవేటర్‌లు మొదలైన వాటి భాగస్వామ్యాన్ని చూస్తారని ఆమె తెలియజేసింది.

ఈ రంగం యొక్క గణనీయమైన సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి మరియు ముందుకు సాగే మార్గాన్ని ఆలోచనలో పడేసేందుకు భారత ప్రభుత్వంలోని ఫార్మాస్యూటికల్స్ శాఖ, రసాయనాలు ఉ ఎరువుల మంత్రిత్వ శాఖ 'ఇండియా: ది నెక్స్ట్ మెడ్‌టెక్ గ్లోబల్ హబ్' పరికరాలు, డయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ భవిష్యత్తు' అనే కేంద్ర థీమ్‌తో 'ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో'ని నిర్వహిస్తోంది.

ఎక్స్‌పోలో ఫ్యూచర్ పెవిలియన్, ఆర్ అండ్ డి పెవిలియన్, స్టార్ట్–అప్ పెవిలియన్, స్టేట్ పెవిలియన్, రెగ్యులేటర్స్ పెవిలియన్ మరియు మేక్ ఇన్ ఇండియా షోకేస్ వంటి వివిధ పెవిలియన్‌లు ఉంటాయి. 150 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు, 150 కంటే ఎక్కువ దేశీయ మరియు అంతర్జాతీయ తయారీదారులు, స్టార్టప్‌లు, రెగ్యులేటరీ ఏజెన్సీతో సహా 400 కంటే ఎక్కువ ఎగ్జిబిటర్లు, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్ర శాఖలు ఇందులో పాల్గొంటాయి.

7 రాష్ట్రాలు – మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మరియు గుజరాత్ ఎక్స్‌పో సందర్భంగా పెవిలియన్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. ఎక్స్‌పోలో ఆవిష్కరణలు మరియు ఆర్‌డడి కోసం పెవిలియన్‌లు కూడా ఉంటాయి. ఇందులో 30 కంటే ఎక్కువ కంపెనీలు కొత్త పరిశోధన మరియు ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి. స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పెవిలియన్ కూడా ఉంటుంది మరియు 75 స్టార్టప్‌లు ఇందులో పాల్గొంటున్నాయి. ఇంకా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్, జీఇఎం,ఐసిఎంఆర్,ఐపిసి, సిడిఎస్‌సిఓ,ఎన్‌పిపిఏ మరియు బిఐఎస్‌తో సహా మెడికల్ డివైసెస్ సెక్టార్‌కి సంబంధించిన 7 రెగ్యులేటరీ ఏజెన్సీలు ఇందులో పాల్గొంటున్నాయి.

3–రోజుల ఈవెంట్‌లో థీమాటిక్ కాన్ఫరెన్స్ సెషన్‌లు నిర్వహించబడతాయి. ఇది విజ్ఞానికి సంబంధించిన అపరిమితమైన సరిహద్దులను అన్వేషించడం, ఆవిష్కరణలను ప్రేరేపించడం మరియు సరిహద్దులను అధిగమించే కనెక్షన్‌లను ఏర్పరచడం వంటి లక్ష్యంతో నిర్వహించబడుతుంది. విజన్ 2047ను సాధించే లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సెషన్‌లు రూపొందించబడ్డాయి. ఇది భారతదేశంలోనే కాకుండా ప్రపంచ ఆరోగ్య సంరక్షణ ల్యాండ్‌స్కేప్‌కు గణనీయమైన సహకారిగా మెడ్‌టెక్ రంగానికి భారతదేశం యొక్క ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది.

3–రోజుల సమావేశం ద్వారా ఈవెంట్ లక్ష్యం:

– వైద్య పరికరాల రంగంలో తాజా పురోగతులు, సవాళ్లు మరియు అవకాశాల గురించి చర్చించడానికి వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిపుణులు మరియు ఆవిష్కర్తలను ఒకచోట చేర్చడం.

–ప్రఖ్యాత పరిశ్రమ నాయకులు మరియు నిపుణులు వారి అంతర్దృష్టులు మరియు అనుభవాలను పంచుకుంటారు. వైద్య పరికరాల డొమైన్‌లో ప్రస్తుత ట్రెండ్‌లు మరియు అవకాశాలపై వెలుగునిస్తారు.

–విజయవంతమైన ఉత్పత్తి అభివృద్ధి మరియు మార్కెట్ అవకాశాలను నిర్ధారించడానికి తాజా నియంత్రణ మార్గదర్శకాలు మరియు సమ్మతి అవసరాలు పరిశ్రమ నాయకులు మరియు విధాన రూపకర్తల మధ్య చర్చించబడతాయి.

–వైద్య పరికరాల అభివృద్ధి, నియంత్రణ మరియు అమలులో సవాళ్లు మరియు అవకాశాల గురించి పరిశ్రమ నిపుణులు, నియంత్రకాలు మరియు ఆరోగ్య సంరక్షణ అభ్యాసకులతో ఆలోచింపజేసే చర్చలు.

ప్రధానంగా 5 ప్రధాన ప్రాంతాలైన ఆఫ్రికా, ఏసియన్, సిఐఎస్, మిడిల్ ఈస్ట్ మరియు ఓషియానియా నుండి 50 దేశాల నుండి మొత్తం 231 మంది విదేశీ కొనుగోలుదారులు అంతర్జాతీయ కొనుగోలుదారు–విక్రేత సమావేశంలో పాల్గొంటారు. ప్రొఫైల్ ఆధారంగా, ఈ కొనుగోలుదారులను ప్రధానంగా నాలుగు ప్రధాన వర్గాలుగా వర్గీకరించవచ్చు

ఆరోగ్య మంత్రిత్వ శాఖ నుండి ప్రభుత్వ అధికారులు – 55

వైద్య పరికరాలు మరియు పరికరాల ప్రధాన కొనుగోలుదారులు ఉ దిగుమతిదారులు –111

సేకరణ ఏజెన్సీలు – 60

ఈ కార్యక్రమంలో శ్రీ రవీంద్ర ప్రతాప్ సింగ్, జాయింట్ సెక్రటరీ (పాలసీ), రసాయనాలు ఉ ఎరువుల మంత్రిత్వ శాఖ; ఫిక్కీ సెక్రటరీ జనరల్ శ్రీ శైలేష్ కె పాఠక్, ఫిక్కీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ శ్రీ మనబ్ మజుందార్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# దళితుల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు : మంత్రి కొప్పుల



కరీంనగర్, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్ యార్డులో ఎస్సీ యూనిట్లను జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ తో సంబంధం లేకుండా చిరు వ్యాపారాలు చేసుకునేందుకు దళితులకు రూ. 50 వేల యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బ్యాంగిల్ షాపులు, పూజ సామాగ్రి దుకాణం, పూల దుకాణం, టీ షాప్ వంటి చిరు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం సహాయం చేసిందని అన్నారు. సీఎం కేసీఆర్ దళితుల కోసం ఉన్న గురుకుల పాఠశాలలను, మహిళ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారని వివరించారు.

విదేశాలలో చదివే దళిత యువత కోసం అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. దళితులు అధికంగా నివసించే ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, త్రాగునీటి సరఫరా, వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా వంటి అనేక మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. గత ప్రభుత్వాలు స్వయం ఉపాధి కింద దళితులకు కేవలం 20 శాతం మాత్రమే సబ్సిడీ అందించేవని వెల్లడించారు. సీఎం కేసీఆర్ దళితుల కోసం వంద శాతం సబ్సిడీ(గ్రాబీఎఇఃతిటఎ) తో బ్యాంకు లింకేజీ లేకుండా 10 లక్షలు సహాయం అందించేందుకు దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు.

ఈ పథకం ద్వారా దళితులు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారని, సిరిసిల్ల జిల్లాలో 5 గురు దళితులు కలిసి రైస్ మిల్ ఏర్పాటు చేశారని అన్నారు. దళిత బంధు(ఆజీశ్రీతిబి ఃజీనిటబీ) పథకం ద్వారా సంపద సృష్టి జరుగుతుందని, ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని చెప్పారు. రెండవ విడత దళిత బంధు కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1100 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధు పథకాన్ని అమలు చేస్తామని మంత్రి అన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కింద రూ. 50 వేల యూనిట్లు అందుకున్న వారికి సైతం భవిష్యత్తులో దళిత బంధు అమలు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు క్యాండిడేట్లు లేరు..బీజేపీకి బలం లేదు : మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట, ఆగష్టు 11: కాంగ్రెక్‌కు గతమే తప్పా భవిష్యత్తు లేదు. కేంద్రం ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టి దారుణంగా విఫలమైంది అసెంబ్లీలోనూ కాంగ్రెస్ తీరు ఎంత దారుణంగా ఉందో చూశామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గంలో వివిధ పార్టీల నుంచి మంత్రి హరీశ్ రావు సమక్షం లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గజ్వేల్ లో కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా రాదు. కాంగ్రెస్‌లో వాళ్ల గొడవలు వాళ్లకే తప్ప ప్రజల బాధలు పట్టవని మండపడ్డారు. బీజేపీ బలం లేదు. కాంగ్రెస్‌కు కాండిడేట్లు లేరు..బీఆర్ఎస్‌కు తిరుగులేదన్నారు. ఎవరు ఔనన్నా, కాదన్నా బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.ఒకప్పుడు ఆంధ్రలో ఎకరం భూమి అమ్ముకుంటే తెలంగాణలో ఐదు ఎకరాలు దొరికేది, నేడు తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రలో ఐదు ఎకరాలు దొరికే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అంటున్నారు. ఇది బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ అనేది మనసులో ఉంటుంది, దుకాణాల్లో కాదు

## – విపక్షాలు లక్ష్యంగా బీజేపీ వీడియో సాంగ్

న్యూఢిల్లీ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: "ప్రేమ అనేది మనసులో ఉంటుంది, దుకాణాల్లో కాదు"అంటూ భారతీయ జనతా పార్టీ శుక్రవారంనాడు సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేసింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విపక్ష పార్టీల అవినీతిని ఎండగడుతూ ఈ వీడియో సాంగ్ రూపొందింది. ప్రేమ మనసులో ఉండేదే కానీ దుకాణాల్లో దొరికేది కాదని, ప్రేమను సంపాదించుకోవాలే కానీ ఎక్కడా అమ్మకానికి దొరకదని బీజేపీ అధికారిక ట్విట్టర్‌లో పేర్కొంది.కాంగ్రెస్ పార్టీ అంటే వినుగువుట్టి నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్రభుత్వానికి ఓటు వేయాలని ప్రజలు నిర్ణయించుకున్నట్టు వీడియోలో చూపించారు. సబ్సిడీకి కుకుంగ్ గ్యాస్ సిలెండర్లు ఇవ్వడం సహా పేద కుటుంబాలకు బీజేపీ చేస్తున్న సాయాన్ని వీడియోలో హైలైట్ చేశారు. ఉగ్ర శిబిరాలను ఏరిపారేసిన ఉరీ ఉగ్రదాడుల ప్రాధాన్యతను, చంద్రయాన్–3 మిషన్ విజయవంతంగా నిర్వహించడాన్ని ఇందులో చూపించారు. కాంగ్రెస్ దుకాణాల్లో ఎమర్జెన్సీ, విభజన, దేశ ప్రజలను కించపరచడం వంటివి మాత్రమే దొరుకుతాయంటూ బీజేపీ చురకలు వేసింది.కాగా, లోక్‌సభలో గురువారం అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా కూడా విపక్షాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తూర్పారబట్టారు. విపక్షాలకు ఉన్నదంతా అధికారంపై ఆకలి మాత్రమేనని అన్నారు. యూపీఏ కూడా బెంగళూరులో అంత్యక్రియలు చేసి ఐ డాట్ ఎన్ డాట్ డీ డాట్...అంటూ 'ఇండియా' అని పేరు పెట్టుకుని, పేరులోనే ఇండియాను ముక్కలు చేశారని విమర్శించారు. అది ఇండియా కాదని, ఘమిండియా (అహంకారుల కూటమి) అన్నారు. మణిపూర్‌తోపాటు మొత్తం ఈశాన్యంలో విచ్ఛిన్నకర శక్తులు, హింసాకాండ రగిలేందుకు కాంగ్రెస్ విధానాలే కారణమన్నారు. కాంగ్రెస్ హయాంలో మణిపూర్‌లో ప్రభుత్వ కార్యాలయాల్లో మహాత్మా గాంధీ ఫొటోను ప్రదర్శించేవారు కాదనీ , పాఠశాలల్లో జాతీయ గీతం ఆలపించేవారు కాదనీ, ఐఏఎస్ అధికారులు కూడా తిరుగుబాటుదారులకు జీతంలో కొంత చెల్లించాల్సి వచ్చేదని చెప్పారు. ఈశాన్య ప్రాంతీయుల మనోభావాలను కాంగ్రెస్ ఎప్పుడూ అర్థం చేసుకోలేదని తెలిపారు. గత తొమ్మిదేళ్లలో తమ హయాంలో ఈశాన్యంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని సభకు వివరించారు.

# రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు : మంత్రి ఎర్రబెల్లి



పాలకుర్తి ఆగస్టు 11 : రాజకీయాలకు అతీతంగా తాను సేవ చేస్తున్నట్లు, తన వద్ద డబ్బులు లేనప్పటికీ, పలువురు స్నేహితుల సహకారంతో వినూత్నంగా, విశేషంగా సేవా కార్యక్రమాలు తమ ఎర్రబెల్లి ట్రస్ట్ తరఫున నిర్వహిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో యువతకు ఉచితంగా ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సుల జారీ కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఈ రోజు మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో తొర్రూరు పట్టణానికి చెందిన 150 మందికి ఉచిత లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సులను మంత్రి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ.. ఉషా దయాకర్ రావు నేతృత్వంలో నిర్వహిస్తున్న ఎర్రబెల్లి ట్రస్టు వైద్య ఆరోగ్య శిబిరాలతో పాటు కరోనా కష్టకాలంలో నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, ఉచిత శిక్షణ ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ, ఉపాధి హామీ కూలీలకు లంచ్ బాక్సుల పంపిణీ, నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి, ఉద్యోగ శిక్షణ, తాజాగా యువతకు డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ వంటి పలు కార్యక్రమాలను దిగ్విజయంగా చేపట్టినట్లు తెలిపారు.

సేవ చేస్తే ప్రజలు మర్చిపోరని తప్పకుండా అండదండలు అందిస్తారని మంత్రి అన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ లేదని మంత్రి అన్నారు. ప్రజల ఆశీర్వాదాలు తనకి ఎప్పుడు ఉంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాలకు చెందిన డ్రైవింగ్ లైసెన్సులు పొందిన అభ్యర్థులు, సంబంధిత శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో 17న మెగా జాబ్ మేళా

మెదక్, ఆగష్టు 11:(నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలోఈ నెల 17వ తేదీన మెదక్ జిల్లా కేంద్రంలోని సాయిబాలాజీ గార్డెన్స్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ మెగా జాబ్ మేళా ద్వారా స్థానికులకే ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జాబ్ మేళాలో 70 కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బట్టకాల్చి మీద వేస్తున్నాయన్నారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. తెలంగాణలో వ్యవసాయ ఎంతో అభివృద్ధి చెందుతుంది. వైద్యం, విద్య రంగాలపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1,32,939 ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మూడు మెడికల్ కాలేజీల నుంచి 40 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రయివేట్ రంగంలోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నేను పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలని ఉంది.. అవకాశమిస్తే బరిలో ఉంటాను. సీఎం కేసీఆర్ నిర్ణయమే శిరోధార్యం అని సుభాష్ రెడ్డి తెలిపారు.

# ఇకపై ఆరేళ్ళు వచ్చిన పిల్లలను మాత్రమే ఒకటో తరగతిలో చేర్చుకోవాలి

బెంగళూరు ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); రాష్ట్రంలో ఇకపై ఆరేళు వచ్చిన పిల్లలను మాత్రమే ఒకటో తరగతిలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హైకోర్టుధర్మాసనం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో 5.5 ఏళ్ళ విద్యార్థులను ఒకటవ తరగతిలో చేర్చుకుంటున్నారు. 2025–26 విద్యాసంవత్సరం నుంచి ఆరేళ్ళ అయిన వారిని మాత్రమే చేర్చుకోవాల్సి ఉంటుంది. 2022 విద్యాసంవత్సరం నుంచే ఆరేళ్ళ చిన్నారులను మాత్రమే బడుల్లో చేర్చుకునేలా ప్రభుత్వం నిర్ణయించింది. 2022 జూలై26న ఇందుకు సంబంధించి ప్రత్యేకమైన ఆదేశాలు జారీ చేశారు. అదే విద్యాసంవత్సరం నుంచే అమలులోకి వస్తుందని అందరూ భావించారు. కానీ అనికేత్ అనే వ్యక్తి హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో వాయిదా పడింది. విచారణ జరిపిన న్యాయమూర్తి సచిన్ శంకర్ మగదుం తుది తీర్పును ప్రకటించారు. జాతీయ విద్యావిధానంలోను వయసు సడలించి తీసుకున్న నిర్ణయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. 2025–26 విద్యాసంవత్సరం నుంచి ఆరేళ్ళ చిన్నారులను ప్రభుత్వ, ప్రైవేటు, అనుధాన, అనుధానరహిత విద్యాసంస్థలలో చేర్చుకునేలా తీర్పును ప్రకటించారు. అనికేత్ పిటీషన్‌ను కొట్టివేశారు. విశ్వవ్యాప్తంగా విద్యావిధానానికి అనుగుణంగా జాతీయ విద్యావిధానంలో నిబంధనలు పొందుపరచారని అలా కాకుండా భిన్నమైన విధానాలు పాటిస్తే విద్యార్థి ఒకే తరగతిని రెండేళ్ళు చదవాల్సి ఉంటుందని ప్రస్తావించిన ధర్మాసనం పిటీషన్‌ను కొట్టివేసింది.

# రోడ్డు దాటుతున్న పులిని ఢీకొట్టిన వాహనం.. గాయాలపాలై మృతి

న్యూఢిల్లీ, ఆగష్టు 11:మహారాష్ట్ర గొండియా జిల్లాలోని నవేగాం– నగ్జీరా కారిడార్‌లో రోడ్డు దాటుతున్న పులిని వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టిన సంగతి తెలిసిందే. దీంతో తీవ్రంగా గాయపడ్డ పులి.. రోడ్డుపైనే ఉండిపోయింది. పులిని చూసిన వాహనదారులు తమ వాహనాలను దానికి కొంచెం దూరంలోనే ఆపేశారు. పులి చేతనై చేతకాక అన్నట్లు అడవిలోకి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలపాలైన ఆ పులి ప్రాణాలు కోల్పోయింది.

నవేగావ్ – నగ్జీరా కారిడార్‌లోని ముర్దోలి ఫారెస్టులో గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఓ రెండేండ్ల వయసున్న పులి రోడ్డును దాటుతుండగా.. వేగంగా వచ్చిన వాహనం దాన్ని ఢీకొట్టింది. దీంతో పులికి తీవ్ర గాయాలయ్యాయి. లేవలేని పరిస్థితిలో, దీనంగా రోడ్డుపైనే పడిపోయింది పులి. ఆ తర్వాత కాసేపటికి అగమనించిన వాహనదారులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి డిప్యూటీ కన్జర్వేటర్ ప్రమోద్ పంచ్‌భాయి తమ బృందంతో అక్కడికి చేరుకున్నారు. పులి ఆచూకీ కోసం వెతికారు. ఘటనాస్థలానికి కొంచెం దూరంలో దీనంగా పడిఉన్న పులిని శుక్రవారం ఉదయం 7:30 గంటలకు గుర్తించారు. అనంతరం తీవ్ర గాయాలపాలైన పులిని నాగ్‌పూర్ గోరెవాడలోని వైల్డ్ లైఫ్ రెస్క్యూ సెంటర్‌కు తరలిస్తుండగానే ప్రాణాలు కోల్పోయింది. అనంతరం దానికి పోస్టుమార్టం నిర్వహించారు. వన్యప్రాణులు సంచరించే అభయారణ్యాల గుండా వెళ్లే వాహనదారులు కాస్త నెమ్మదిగా ప్రయాణించాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

# ఆగస్టు 12 వ తేదీన మధ్య ప్రదేశ్‌ను సందర్శించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 11:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 ఆగస్టు 12 వ తేదీ నాడు మధ్య ప్రదేశ్ ను సందర్శించనున్నారు. మధ్యాహ్నం పూట సుమారు గా 2 గంటల 15 నిమిషాల వేళ కు ఆయన సాగర్ జిల్లా కు చేరుకొని, అక్కడ సంత్ శిరోమణి గురుదేవ్ శ్రీ రవిదాస్ జీ స్మారక స్థలం లో భూమి పూజ ను నిర్వహిస్తారు. ప్రధాన మంత్రి మధ్యాహ్నం దాదాపు గా 3 గంటల 15 నిమిషాల వేళ కు ధన లో జరిగే ఒక సార్వజనిక కార్యక్రమం లో పాలుపంచుకొంటారు. అక్కడ ఆయన సంత్ శిరోమణి గురుదేవ్ శ్రీ రవిదాస్ జీ స్మారకానికి శంకుస్థాపన చేస్తారు.

ప్రముఖ సాధువుల ను మరియు సమాజ సంస్కర్తల ను ఆదరించడం ప్రధాన మంత్రి చేపడుతున్న కార్యక్రమాల లో ఒక విశిష్టత గా ఉంది. ఆయన యొక్క ఈ దృష్టి కోణం నుండి ప్రేరణ నుపొంది, సంత్ శిరోమణి గురుదేవ్ శ్రీ రవిదాస్ జీ స్మారకాన్ని 11.25 ఎకరాల పైచిలుకు విస్తీర్ణం లో వంద కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో నిర్మించడం జరుగుతుంది. ఈ భవ్యమైన స్మారకం లో సంత్ శిరోమణి గురుదేవ్ శ్రీ రవిదాస్ జీ యొక్క జీవనం, ఆయన ఆలోచన విధానం మరియు బోధన ల ను కళ్లకు కట్టే ఆకర్షణీయమైనటువంటి కళాకృతుల సంగ్రహాలయం తో పాటు ఒక చిత్రశాల కూడా ఉంటుంది. దీనిలో స్మారకానికి విచ్చేసే భక్తజనానికై నివాసాలు, భోజనాలయం వంటి సదుపాయాలు కూడా ఏర్పాటు అవుతాయి.

ఇదే కార్యక్రమం లో భాగం గా, ప్రధాన మంత్రి 4,000 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన రైలు మరియు రహదారి రంగ సంబంధి వివిధ ప్రాజెక్టుల కు శంకుస్థాపన చేయడంతో పాటుగా దేశ ప్రజల కు అంకితం చేయనున్నారు.

ప్రధాన మంత్రి ఈ పథకాన్ని కోటా–బీనా రైలు మార్గం యొక్క డబ్లింగ్ కు ప్రతీక గా దేశ ప్రజల కు అంకితం చేయనున్నారు. సుమారు 2475 కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో తయారైన ఈ ప్రాజెక్టు రాజస్థాన్ లో కోటా మరియు బారాం జిల్లా లు మరియు మధ్య ప్రదేశ్ లో గుణ, అశోక్ నగర్, ఇంకా సాగర్ జిల్లా ల గుండా సాగుతుంది. అదనపు రైలు మార్గాల ద్వారా మెరుగైన గతిశీలత సామర్థ్యం అందుబాటులోకి రావడం తో పాటు మరి ఆ మార్గం లో రైళ్ల ప్రయాణ వేగాన్ని మెరుగపరచడం లో తోడ్పాటు లభించనుంది.

ప్రధాన మంత్రి 1580 కోట్ల రూపాయల కు పైచిలుకు వ్యయం తో నిర్మాణం కాబోయే రెండు రహదారి పథకాల కు శంకుస్థాపన చేస్తారు. వీటిలో మోరీకోరీ – విదిశ – హినోతియా ను కలుపుతూ సాగే నాలుగు దోవల రోడ్డు ప్రాజెక్టు మరియు హినోతియా ను మెహ్ లువా తో కలిపే రోడ్డు ప్రాజెక్టు లు భాగం గా ఉన్నాయి.

# మహిళల పక్షపాతి సీఎం కేసీఆర్ : మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యపేట, ఆఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): మహిళా ఆరోగ్యం, సాధికారతకు ముఖ్య మంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో వాసవి ? వనిత క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు కార్యక్రమానికి హాజరైన మంత్రి 104 మంది గర్భిణులకు చీరలు, పండ్లు, పూలు పంపిణీ చేసి ఆశీర్వదించారు. అనంతరం మాటాడుతూ.. కుల,మత భేదాలు లేకుండా ఇంతమంది పేద మహిళలకు వనిత–వాసవి క్లబ్ ఆధ్వర్యం లోసామూహిక సీమంతాలు నిర్వహించడం అభినందనీయమనిఅన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సాధికారత లక్ష్యంగా పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పథకాల అమలులో రాష్ట్రం చాలా ముందుందని చెప్పారు. మహిళల హక్కులు, గౌరవాన్ని కాపాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కిట్‌తో ఆడబిడ్డలకు పౌష్టికాహారం అందిస్తూ.. కళ్యాణలక్ష్మి కింద ఆడపిల్లల పెళ్లి ఖర్చులు చూసుకుంటూ కుటుంబ పెద్దగా నిలిచారన్నారు.

ఇటీవల ఆడబిడ్డల కోసం తెచ్చిన ఆరోగ్య మహిళ పథకం వారీ పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న ప్రేమ, అభిమానాలకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఉప్పల లలితా ఆనంద్, ఉప్పల ఆనంద్, గుండా శ్రీదేవి, రాచకొండ శ్రీనివాస్, చల్లా లక్ష్మీకాంత్, రాచర్ల కమలాకర్, తోట శ్యామ్, లక్ష్మి, వెంపటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో రూ. 2 లక్షల విలువైన ఈ-సిగరెట్లు సీజ్.. నలుగురు అరెస్ట్

హైదరాబాద్ ఆగష్టు 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జూబ్లీహిల్స్‌లో నిషేధిత ఈ–సిగరెట్లు విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు వ్యక్తుల నుంచి రూ. 2 లక్షల విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ–సిగరెట్లు విక్రయిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఆ నలుగురిని పట్టుకున్నారు. అరెస్టు అయిన వారిలో షేక్ అస్లాం, రహీల్ ఖాన్, రిషి అగర్వాల్, శ్రేయాష్ అగర్వాల్ ఉన్నారు. మరో అనుమానితుడు మహమ్మద్ షోయబ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. షేక్ అస్లాం గత కొన్నాళ్ల నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లో పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. అతను నిషేధిత ఈ–సిగరెట్లు, హుక్కా ఫ్లేవర్స్‌ను విద్యార్థులకు, యువతకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ–సిగరెట్లను సరఫరా చేసేందుకు, విక్రయించేందుకు అస్లాంకు మిగతా ముగ్గురు మద్దతు ఇచ్చినట్లు పోలీసులు తేల్చారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి రూ.2 లక్షల విలువైన సిగరెట్లు, హుక్కా ఫ్లేవర్లను స్వాధీనం చేసుకున్నారు.


# ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్.. దరఖాస్తుల తీరుపై పరిశీలన

హైదరాబాద్, ఆగష్టు 11:: వికారాబాద్ జిల్లాలోని 59 మద్యం దుకాణాలు గాను ఆరంభించిన మద్యం టెండర్ల కోసం దరఖాస్తుల స్వీకరణ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత కార్యాలయాన్ని పరిశీలించారు. జిల్లా ఎక్సైజ్ సూపర్ డాన్స్ నవీన్ చంద్రతో జిల్లాలోని ఐదు సర్కిల్లో దాఖలవుతున్న దరఖాస్తు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. 18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉండగా ఈనెల 21వ తేదీన లక్కీ డ్రా వయసులను కేటాయించనున్నారు.

# పేదింటి పెద్దన్నగా సీఎం కేసీఆర్ : మంత్రి ఎర్రబెల్లి

జనగామ, ఆగష్టు 11: తెలంగాణ రాష్ట్రంలో పేదింటి పెద్దన్నగా సీఎం కేసీఆర్ నిలిచిపోయారని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. 99 మంది పేదింటి ఆడబిడ్డలకు పాలకుర్తిలో గల క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లిమాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో ఆడబిడ్డ పెండ్లికి మేనమామగా మారి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

ఇలాంటి పథకం దేశంలో ఎక్కడ లేదన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రజల కోసమే పనిచేస్తూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి మనమంతా అండగా ఉండాలన్నారు. మరోసారి ఃఖీా పార్టీని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


నిఖిలేశ్వర్ రచనలు
నిఖిల లోకం
సాహిత్య సంగమం
ఆవిష్కరణ


తేదీ: 13 ఆగస్టు, 2023 (ఆదివారం)
సమయం: 10-30 నుంచి
స్థలం: సురభి గ్రాండ్
(శివంరోడ్-బాగ్ అంబర్‌పేట్)
స్వాగతం: కె. రాహుల్
అధ్యక్షులు: కె. శివారెడ్డి
ఆవిష్కర్త: నగ్నముని
పుస్తక పరిచయకర్తలు:
డా. డి. చంద్రశేఖర రెడ్డి
డా. యస్. జతిన్ కుమార్
ప్రసంగాలు:
వోల్గా
డా.కె. శ్రీనివాస్
తెలకపల్లి రవి
ప్రొ. యస్వీ సత్యనారాయణ
డా. నందిని సిధారెడ్డి
ప్రొ. జయధీర్ తిరుమలరావు
జీవన్‌కుమార్ (మా.టి.వే)
నిఖిలేశ్వర్ స్పందన
కృతజ్ఞతలు: కె. సమీర్
మధ్యాహ్న భోజనం (లంచ్) 1.30 Pm to 3 Pm

